

సంస్కృత వర్సిటీలో అనిర్బన్

జాతీయ సంస్కృత వర్సిటీని కేంద్ర హోం మంత్రిత్వశాఖ బెంగళూరు ప్రాంతీయ కార్యాలయ అధికార భాష డీడీ సందర్శించారు. - 8లో



భూ రీసర్వేకి బ్రేకులు!

భూముల రీసర్వేకి ప్రభుత్వం బ్రేకులు వేసింది. ప్రభుత్వ భూములు మాత్రమే సర్వే చేసేందుకు సర్కారు సమాయత్తమవుతోంది - 8లో



దారి కల్పించే వారేరీ?

రోడ్డుకు కంచె వేయడంతో ఓ ఇంటికి దారి లేకుండా పోయింది. మాకు దారి కల్పించేవారేరీ అని బాధితులు అంటున్నారు. - 8లో

న్యూస్‌రీల్

తిరుపతి-కువైట్‌కు అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభించాలి

- ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సీఈఓతో ఎంపీ గురుమూర్తి భేటీ



ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సీఈఓ అలోక్ సింగ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం : తిరుపతి విమానాశ్రయం నుంచి కువైట్‌కు అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభించాలని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి కోరారు. బుధవారం ఢిల్లీలో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సీఈఓ అలోక్ సింగ్‌తో ఆయన భేటీ అయ్యారు. తిరుపతి విమానాశ్రయం ప్రాధాన్యతను, అలాగే రాయలసీమకు చెందిన వలస కార్మికులు గల్ఫ్ దేశాల్లో ఎక్కువగా ఉన్నారని, వారికి మేలు జరుగుతుందని ఆయనకు ఎంపీ వివరించారు. తిరుపతి నుంచి నేరుగా కువైట్‌కి వెళ్లే విమానం నడిపితే గల్ఫ్ వలసదారులకు ఎంతో ఉపశమనం లభిస్తుందని, దీంతో ప్రయాణ సమయం, ఖర్చు తగ్గుతాయని ఆయనకి విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం సమర్పించారు. ఈ విజ్ఞప్తికి అలోక్ సింగ్ సానుకూలంగా స్పందించారని ఎంపీ తెలిపారు.


ఎట్టకేలకు ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపు

తిరుపతి సిటీ: ఎట్టకేలకు ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపు జరిగింది. తొలి విడత జాబితా మంగళవారం విడుదల చేస్తామంటూ ప్రకటించిన అధికారులు సాంకేతిక కారణాలతో జాబితా విడుదలలో జాప్యమైనట్లు ప్రకటించారు. దీంతో మంగళవారం అంతా ఫోన్‌లకే పరిమితమైన తల్లిదండ్రులు, విద్యార్థులకు నిరాశే మిగిలింది. బుధవారం సాయంత్రం 6 గంటలకు తొలివిడత సీట్ల కేటాయింపు జాబితా విడుదలైంది. దీంతో తల్లిదండ్రులు, విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. తాము ఎంపిక చేసుకున్న కళాశాలలో సీట్లు సాధించిన విద్యార్థులు ఈనెల 27వ తేదీలోపు సంబంధిత కళాశాలలో రిపోర్ట్ చేయాల్సి ఉంది.

విధులకు హాజరు కాకుంటే తొలగిస్తాం

తిరుపతి సిటీ: రేణిగుంట మండలం గుండ్రాలకాలువ పాఠశాలలో ఎస్జీటీగా విధుల నిర్వహిస్తున్న పి.దేవరాజులు 2022 జూన్ 27వ తేదీ నుంచి విధులకు హాజరుకావడం లేదని డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు. జిల్లా విద్యాశాఖ నుంచి పలుసార్లు రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఎంఈఓ లేఖలు పంపినప్పటికీ పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారన్నారు. సదరు టీచర్ మరో మూడు రోజుల్లోపు ఎంఈఓ కార్యాలయంలో హాజరై సంజాయిషీ ఇవ్వాలని, లేనిపక్షంలో విధుల నుంచి శాశ్వతంగా తొలిగిస్తామన్నారు.

నేను మారిన మనిషిని.. మహిళలను మహారాణులను చేస్తాను.. మహాశక్తి ఆడబిడ్డ నిధి పథకంతో అతివలను అందలమెక్కిస్తాను.. అధికారంలోకి వస్తే అందరినీ ఆదుకుంటాను.. నా మాట నమ్మండి.. ఇదీ నాటి చంద్రబాబు మాట. మహాశక్తి ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే ఆంధ్రను అమ్మేయాల్సిందే.. ఇదీ నేటి వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట.. అంటే కూటమి సర్కారు ఆ పథకానికి మంగళం పాడేసినట్టేనన్న సంకేతాలు స్పష్టంగా వస్తున్నాయి. అయితే అతివలు మాత్రం దీనిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆడబిడ్డల ఉసురు తగిలిన ఏ ప్రభుత్వం మనుగడ సాగించలేదని మండిపడుతున్నారు.



మహాశక్తికి మంగళమేనా?

ఆడబిడ్డకు అధోగతేనా? అని అతివల మండిపాటు

- ఆడబిడ్డ నిధి అమలు చేయాలంటే ఆంధ్రను అమ్మాల్సిందేనంటూ సెటైర్లు
- మంత్రి వ్యాఖ్యలపై మండిపడుతున్న మహిళాలోకం
- మహిళలను నమ్మించి మోసం చేసిన బాబు సర్కార్
- ప్రజా తిరుగుబాటు ఖాయమని హెచ్చరిస్తున్న మహిళలు

జిల్లాలో ఆడబిడ్డ నిధి వివరాలు

నియోజకవర్గం	ఆడబిడ్డ నిధికి అర్హులు	ఏడాదిగా అందాల్సిన మొత్తం(కోట్లలో)
తిరుపతి	1,22,357	220..24
చంద్రగిరి	1,32,553	238.59
శ్రీకాళహస్తి	1,19,650	215.37
వెంకటగిరి	1,12,321	202.17
సత్యవేడు	1,03,757	186.76
సూళ్లూరుపేట	1,10,990	199.78
గూడూరు	99,845	179.62

తిరుపతి సిటీ: గత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు మారిన మనిషినంటూ జనాన్ని నమ్మించాడు. అమలుకు సాధ్యం కానీ హామీలు గుప్పించి.. అధికారం చేజిక్కించుకున్నాడు. అనంతరం హామీలను గాలికొదిలేసి నమ్మి ఓటు వేసిన మహిళలకు శఠగోపం పెట్టేశాడు. ఆడబిడ్డ నిధి పథకంతో ప్రతి కుటుంబంలోని 18 ఏళ్లు నిండిన మహిళలందరికీ నెలకు రూ.1500 బ్యాంకు ఖాతాలో జమ చేస్తానని ప్రగల్భాలు పలికాడు. అయితే నేడు ఆడబిడ్డ నిధికి మంగళం పాడేస్తున్నట్లు మంత్రి ద్వారా సంకేతాలు పంపుతున్నారు.

ఆడబిడ్డ నిధి పథకమా.. ఆంధ్రాను అమ్మాల్సిందే!

సూపర్ సిక్స్ హామీల్లో ఆడపడుచులకు సంబంధించి మహాశక్తిలో భాగంగా బాబు ప్రకటించిన ఆడబిడ్డ నిధి పథకం అమలుపై ఏడాది గడుస్తున్నా నోరు మెదపలేదు. దీంతో ఎప్పుడో ఒకప్పుడు ఇస్తారులే అన్న ఆశతో ఎదురు చూస్తున్న మహిళలకు ఒక్కసారిగా బాబు సర్కార్ ఝలక్ ఇచ్చింది. స్వయానా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఓ సభలో ఆడబిడ్డ నిధి అమలుపై ప్రజలకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. మహాశక్తి ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే ఆంధ్రరాష్ట్రాన్ని అమ్మేయాల్సిన పరిస్థితి వస్తుందని బహిరంగంగా ప్రకటించేశారు. దీంతో ఆడబిడ్డ నిధికి మంగళం పాడేశారని, తమను నమ్మించి మోసం చేశారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో రూ.2,500 కోట్ల బకాయిలు

జిల్లాలో 2024 గణాంకాల ప్రకారం 18 ఏళ్ల పైబడిన మహిళలు మొత్తం 10,23,177 మంది ఉన్నారు. బాబు సర్కార్ ఆడబిడ్డ నిధికి సంబంధించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం గత ఏడాది కాలానికి రూ.2513.02 కోట్లు బకాయి పడింది. అంటే సరాసరి ఒక్కో మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఏడాదిగా పథకాల అమలులో గోల్‌మాల్ చేస్తూ నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి పథకాల అమలుపై నోరుమెదపలేదు. ఇటీవల మంత్రి చాలా స్పష్టంగా ఆడబిడ్డనిధి పథకం అమలు చేసే పరిస్థితి లేదని బాహాటంగా చెప్పడంతో కూటమి సర్కార్ నైజం బయటపడిందని, రానున్న రోజుల్లో ప్రజా వ్యతిరేఖతను బాబు సర్కార్ ఎదుర్కొనక తప్పదని హెచ్చరిస్తున్నారు.

హామీలు గుప్పించినప్పుడు తెలియలేదా మంత్రివర్యా!



అధికార దాహంతో అలివికాని హామీలను గుప్పించి మహిళలను మభ్యపెట్టి అధికారం చేపట్టారు. నా ఆడబిడ్డలకు అండగా ఉంటానంటూ ఆడబిడ్డ నిధి పథకం అమలు చేసి తీరుతా అంటూ చంద్రబాబు ఎన్నికల సభల్లో ప్రగల్భాలు పలికారు. ఇప్పుడు మా వల్లకాదు అంటున్నారు. సాక్షాత్తు మంత్రి అచ్చెన్నాయుడు ఆంధ్రాను అమ్మితేగాని ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయలేమంటూ తేల్చిచెప్పడం విడ్డూరంగా ఉంది. హామీలు గుప్పించిన నాడు ఈ విషయం మంత్రి వర్యులకు తెలియదా.. కచ్చితం పథకం అమలు చేసి తీరాలి. లేదంటే మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదు. –డాక్టర్ సాయిలక్ష్మి, ఐద్వా, జిల్లా కార్యదర్శి, తిరుపతి

మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదు



కూటమి సర్కార్ ఎన్నికల హామీలను అమలు చేయకుంటే మహిళల ఆగ్రహానికి గురికాకతప్పదు. అధికారం కోసం మహిళలను మభ్యపెట్టి ఆడబిడ్డ నిధి పథకాన్ని షరతులు లేకుండా అమలు చేస్తామని చెప్పారు. నేడు అమలు చేయలేమని చేతులెత్తేస్తున్నట్లు సెటైర్లు వేయడం కూటమి ప్రభుత్వం అసమర్థ పాలనకు నిదర్శనం. జిల్లాలో లక్షల మంది మహిళలు ఆడబిడ్డ నిధి పథకం అమలు కోసం ఎదురు చూస్తున్నారు. తక్షణం పథకాన్ని అమలు చేసి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. లేనిపక్షంలో మహిళలోకం తిరగబడే పరిస్థితి ఉంది. –ఆర్ ఆషా, పీడీఎస్ఓ, జిల్లా కార్యదర్శి, తిరుపతి

మహిళలను మోసం చేయడం దారుణం



ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయలేమని సాక్షాత్తు మంత్రి ప్రకటించడం ఆశ్చర్యమేసింది. ఎన్నికల సమయంలో అమలు చేయలేమని తెలిసీ హామీ ఇచ్చారంటే మహిళలను వంచించి మోసం చేసి ఓట్లు దండుకుని అధికారం చేపట్టాలనే ఏకైక లక్ష్యంతో హామీలు ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. జిల్లాలోని ప్రతి ఇంట్లో మహిళ ఈ పథకం అమలు చేస్తారని ఎంతో ఆశగా ఎదురు చూశారు. కానీ కూటమి ప్రభుత్వం ఆశలపై నీళ్లు చల్లేసినట్లు తెలుస్తోంది. ప్రజా వ్యతిరేఖ కార్యక్రమాలు చేపడితే ఏ ప్రభుత్వమైన మనుగడ సాగించడం కష్టమే. –శ్రవంతి, విద్యార్థి సంఘం నాయకురాలు, తిరుపతి

ఆడబిడ్డ నిధిపై సెటైర్లు దారుణం



ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చకుండా మహిళలను వంచించడం దారుణం. ఆడబిడ్డ నిధి కింద కుటుంబంలోని ప్రతి మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని కూటమి నేతలు ప్రకటించారు. దీంతో పెద్ద ఎత్తున మహిళలు ఆ పార్టీలకు ఓట్లు వేసి గెలిపించారు. మహిళలు ఎంతో నమ్మకంగా ఇచ్చిన అధికారాన్ని అంతే నమ్మకంతో ఇచ్చిన మాటకు కట్టుబడి పథకాలను అమలు చేయాలి. మంత్రి ఆడబిడ్డ నిధిపై సెటైర్లు వేస్తూ ఆంధ్రాని అమ్మాలంటూ మాట్లాడటం దారుణం. – సావిత్రి, గృహిణి, తిరుపతి

మంత్రి వ్యాఖ్యలు మహిళలను బాధించాయి



సార్వత్రిక ఎన్నికల్లో అధికార వాంఛతో కూటమి నేతలు మహిళలను మభ్య పెట్టి పథకాలను ప్రకటించి అమలు చేసి తీరుతామంటూ ప్రగల్భాలు పలికారు. అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా పథకాల ప్రస్తావనే రావడం లేదు. ఆడబిడ్డ నిధిని నిర్వీర్యం చేశారు. లక్షల మంది మహిళలు ఆడబిడ్డ నిధి కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్న తరుణంలో మంత్రి బహిరంగ సభలు పథకం అమలు చేయాలంటే ఆంధ్రను అమ్మేయాలంటూ వెటకారంగా మాట్లాడటం మహిళలను ఎంతో బాధించింది. పథకం అమలు చేయకపోతే ఆంధ్రలో పరిస్థితి దారుణంగా ఉంటుంది. కూటమి ప్రభుత్వం కథ కంచికే. – శోభారాణి, ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయిని, తిరుపతి

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండాయి. క్యూ నారాయణగిరి వరకు చేరుకుంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 79,467 మంది స్వామివారిని దర్శించుకోగా 28,642 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.42 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించబోరని స్పష్టం చేసింది.

రేపటి నుంచి టీటీడీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

- 31 వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు

తిరుపతి సిటీ: జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మిగిలి ఉన్న సీట్లకు ఈనెల 31 వరకు అన్ని గ్రూపుల్లో ప్రవేశాలు చేపటనున్నట్లు ఆర్ఐఓ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న పద్మావతి మహిళా జూనియర్ కళాశాల, ఎస్వీ బాయ్స్ జూనియర్ కళాశాలలో మిగిలి ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు టీటీడీ డీఈఓ ఒక ప్రకటనలో తెలిపారు. ఇదివరకే దరఖాస్తు చేసుకుని మూడు విడతల్లో జరిపిన కౌన్సెలింగ్ ప్రక్రియలో సీటు రానివారు స్పాట్ అడ్మిషన్లకు అర్హులని తెలిపారు. ఇందులో టీటీడీ ఉద్యోగుల పిల్లలు, బాలమందిరం విద్యార్థులకు ప్రథమ ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. మెరిట్ ప్రాతిపదిక సీట్ల కేటాయించనున్న ఈ స్పాట్ అడ్మిషన్లు శుక్రవారం, శనివారం రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ అంటే బాలింతలకు భరోసా.. ప్రసవానంతరం తల్లీబిడ్డలను సురక్షితంగా.. సుఖవంతంగా ఇంటికి చేర్చే సంచార వాహనం. అయితే ప్రస్తుతం ఆ వాహనలకు జబ్బు చేసింది. అదేంటో తెలుసా.. కూటమి సర్కారు నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం.. చిన్నచిన్న రిపేర్లతో నెలల తరబడి షెడ్లకే పరిమితమైనా వాహనాలు.. డ్రైవర్ల కొరత.. వాహన చోదకులకు చాలీచాలని వేతనాలు.. అవి కూడా సకాలంలో అందని వైనం గురించి పట్టించుకోవడం లేదు. ఫలితంగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు అలసి, సొలసి నీరసించి పోతున్నాయి. బాలింతలకు తిప్పలు తప్పని పరిస్థితులు నెలకొన్నాయి.



తిరుపతి ప్రసూతి ఆస్పత్రి సెల్లార్‌లో పాడైన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు

జిల్లా సమాచారం

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు	29
నడుస్తున్న వాహనాలు	19
ఉండాల్సిన డ్రైవర్లు	33 మంది
అందుబాటులో ఉన్న డ్రైవర్లు	18 మంది
పాడైన వాహనాలు	8

వాహనాల కేటాయింపు ఇలా..

తిరుపతి ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో	19
శ్రీకాళహస్తి	3
గూడూరు	2
వెంకటగిరి, సత్యవేడు, పుత్తూరు, చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు	ఒక్కో వాహనం

తల్లీబిడ్డ.. అలసి సొలసి!

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు సుస్తీ

- వేధిస్తున్న డ్రైవర్ల కొరత
- డ్రైవర్లకు అందని వేతనాలు
- మూలనపడిన ఎక్స్‌ప్రెస్ వాహనాలు

తిరుపతి తుడా: ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం అనంతరం తల్లీబిడ్డలను సురక్షితంగా ఇళ్లకు చేర్చేందుకు ఏర్పాటు చేసిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వ్యవస్థకు చంద్రగ్రహణం పట్టింది. పాడైన ఎక్స్‌ప్రెస్ వాహనాలు, డ్రైవర్ల కొరత, చాలీచాలని వేతనాలు, ఆపై వేతనాల చెల్లింపులో అలసత్వం తదితర సమస్యలతో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సతమతమవుతోంది. ఈ నేపథ్యంలో తల్లీబిడ్డ సురక్షితంగా ఇళ్లకు చేరడం అసాధ్యంగా మారింది. ప్రభుత్వం తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లపై దృష్టి సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వేధిస్తున్న డ్రైవర్ల కొరత

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను నడిపేందుకు సరిపడా డ్రైవర్లు లేరు. దీంతో డ్రైవర్ల కొరత వేధిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 29 వాహనాలు ఉండగా కేవలం 18 మంది మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉన్నారు. డ్రైవర్లకు చెల్లించే వేతనాలు సంతృప్తికరంగా లేకపోవడంతో ఒకటి రెండు నెలలకే డ్రైవర్లు నిలిచిపోతున్నారు. దీంతో తరచూ డ్రైవర్ల కొరత వేధిస్తోంది. ఉన్న డ్రైవర్లపై పనిఒత్తిడి పెరుగుతోంది. ఒక డ్రైవర్‌కి నెలకు రూ.8 వేల లోపే వస్తుండడంతో ఆవైపు మొగ్గు చూపడం లేదు. కనీసం రూ. 15 వేలు ఇవ్వకుంటే డ్యూటీలు చేయలేమంటూ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలీచాలని జీతాలు, పని ఒత్తిడితో సతమతమవుతున్నామని వారు తమ గోడును వెళ్లబోసుకున్నారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

తల్లీబిడ్డలకు అవస్థల ప్రయాణం

డ్రైవర్లు, వాహనాల కొరత కారణంగా ఉదయం పూట డిశ్చార్జ్ అయినా మధ్యాహ్నం తరువాత డిశ్చార్జ్ అయిన తల్లీబిడ్డలను ఒకేసారి ఒక్కొక్క వాహనంలో ఇద్దరు లేదా ముగ్గురిని తరలిస్తున్నారు. దీంతో వారు క్షేమంగా ఇంటికి చేరుకోలేని పరిస్థితి నెలకొంది. దీనికితోడు వాహన డ్రైవర్లకు వేతనాలు సక్రమంగా చెల్లించకపోవడంతో వారు వాహనంలో ప్రయాణించిన బాలింతల బంధువులను డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇలా పలు రకాల అవస్థలు భరించలేక తల్లీబిడ్డలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి, ఆర్థికంగా నష్టపోతున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాల్సి వస్తోంది.



స్వగ్రామానికి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్న వాహనం ఎక్కుతున్న తల్లీబిడ్డలు

వాహనాలు షెడ్డుకే పరిమితం

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలకు చిన్నచిన్న రిపేర్లు రావడంతో మొరాయిస్తున్నాయి. దీంతో అవి మరమ్మతులకు నోచుకోక షెడ్డుకే పరిమితం అవుతున్నాయి. ఉన్న ఎక్స్‌ప్రెస్ వాహనాలను ఎక్కితే తల్లీబిడ్డలు సురక్షితంగా ఇళ్లకు చేరుతామా? లేదా అన్న భయం నెలకొంది. తిరుపతి ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సెల్లార్‌లో 8 వాహనాలు రిపేర్లతో మూలనపడ్డాయి. ఇం.ఇన్ నుంచి ఆయిల్ లీక్, టైర్లు అరిగిపోవడం వంటి ఇతర మరమ్మతులకు గురైన ఈ వాహనాలు తుప్పు పడుతున్నాయి. నిర్వహణ లోపంతో వాహనాలు కండిషన్‌లో లేవని డ్రైవర్లు పేర్కొంటున్నారు. ఈ వాహనాల్లో తల్లీబిడ్డను ఇళ్లకు చేర్చడం కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డ్రైవర్ల వేతనాల చెల్లింపులో అలసత్వం

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు నడపడానికి డ్రైవర్లు అసలే అరకొరగా ఉన్నారు. వారికి ఇచ్చే వేతనాలు చాలీచాలకుండా ఉన్నాయి. వాటి చెల్లింపులోనూ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. నెలనెలా జీతాలు అందకపోవడంతో పనిచేస్తున్న డ్రైవర్లు అవస్థ పడుతున్నారు. 4 నెలలుగా వేతనం అందకపోవడంతో ఉన్న డ్రైవర్లు సైతం విధులు నిర్వహించడానికి సుముఖత చూపడం లేదు. ఫలితంగా తల్లీబిడ్డ క్షేమంగా ఇల్లు చేరడం కష్టం అవుతోంది. దీంతో బాలింతలు, వారి బంధువులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

ప్రజాభిమానాన్ని ఆపలేరు



వరదయ్యపాళెంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నూకతోటి రాజేష్, పార్టీ శ్రేణులు

- సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: అక్రమ అరెస్టులతో ప్రజాభిమానాన్ని ఆపలేరని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. బుధవారం వరదయ్యపాళెం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద ఆయన పార్టీ శ్రేణులతో కలిసి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసలు మద్యం స్కాం ఎక్కడ జరిగిందని, ఎంపీ మిథున్‌రెడ్డిని ఎందుకు అరెస్టు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి బీరేంద్ర వర్మ, మండల పార్టీ అధ్యక్షుడు నాయుడు దయాకర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చిన్నా, చేనేత విభాగ రాష్ట్ర కార్యదర్శి బొప్పన తిలక్‌బాబు, రాష్ట్ర యువజన కార్యదర్శి శిబి చక్రవర్తి, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి అబ్దుల్, జిల్లా సోషల్ మీడియా కార్యదర్శి శోభన్ యాదవ్, సీనియర్ నాయకులు దామోదర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, భానుప్రకాష్ రెడ్డి, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు బందిల సురేష్ (బూత్ కమిటీ), వినోద్ యాదవ్ (యువజన), దుద్దు వేణు (ఎస్సీ సెల్), దేవళ్ల మహేంద్ర (బీసీ సెల్), శివా యాదవ్ (ప్రచార కమిటీ), గిరిరెడ్డి (గ్రీవెన్స్ సెల్), మాజీ సర్పంచ్ కవిత తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే మిథున్ రెడ్డి అరెస్టు

సత్యవేడు: రాజకీయ కక్షతోనే రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని అర్ధరాత్రి అరెస్టు చేశారని వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. బుధవారం సత్యవేడులో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం సమీపంలో నిరసన తెలిపి, నేతాజీ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నూకతోటి రాజేష్ మాట్లాడుతూ లేని మద్యం కేసు సృష్టించి.. జగన్‌మోహన్ రెడ్డికి సన్నిహితంగా ఉన్నారన్న అక్కసుతో మిథున్ రెడ్డిని ఆ కేసులో ఇరికించారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బీరేంద్రవర్మ, మండల కన్వీనర్ కే. సుశీల్‌కుమార్ రెడ్డి, పార్టీనాయకులు భానుప్రకాష్ రెడ్డి, కేవి. నిరంజన్‌రెడ్డి, ఏపీఎం బాలాజీ రెడ్డి, సర్పంచ్ పి. మంజుల, రమేష్, మస్తానీ, బి. సోమశేఖర్, సెంథిల్, పునిద కుమార్, కృష్ణయ్య, ఎంపీ రవి, వీడీ శరవనన్, పళణి, దయాళన్, శ్రీధర్ రెడ్డి, ఇస్మాయిల్, జోషఫ్, సోము, రాబిన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.1,03,800
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.9,380

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.1,19,300
రిటైల్ వెండి గ్రాము	రూ.122.30

భూ రీసర్వేకి బ్రేకులు!

భూముల రీసర్వేపై ప్రభుత్వం బ్రేకులు వేసింది. ప్రసుత్తానికి కేవలం ప్రభుత్వ భూములు మాత్రమే సర్వే చేసేందుకు సమాయత్తం అవుతోంది. అందుకు అనుగుణంగా ఆగస్టు 1 నుంచి భూ సర్వేకు శ్రీకారం చుడుతోంది. అయితే ఇక ప్రైవేటు భూముల సర్వేను అటకెక్కించినట్లేనని విమర్శలు గుప్పుమంటున్నాయి. భూ వివాదాలు ఎక్కువగా ఉండేది ప్రైవేటు భూముల్లోనే ..వాటిని వదిలేసి కేవలం ప్రభుత్వ భూములనే సర్వే చేపట్టాలని నిర్ణయం తీసుకోవడంపై ప్రజలు మండిపడుతున్నారు.



గత సర్కార్‌లో భూముల రీ సర్వే చేసిన జిల్లా సమాచారం

మొత్తం జిల్లాలో సర్వే గ్రామాలు	1,051
సర్వేకు ఉపయోగించిన సర్వేయర్ల సంఖ్య	421
సర్వే చేయాల్సిన భూములు	15,40,351 ఎకరాలు
సర్వే చేసిన భూములు	2,65,457 ఎకరాలు
తొలి దశలో సర్వే పూర్తి చేసిన గ్రామాలు	74
రెండో దశలో సర్వే పూర్తి చేసిన గ్రామాలు	106
మూడో దశలో సర్వే దాదాపుగా పూర్తి చేసిన గ్రామాలు	140
నాల్గో దశలో సర్వేకి ఎంపిక చేసిన గ్రామాలు	731
సర్వే పూర్తయిన 34 వేల మంది రైతులకు భూ హక్కు పత్రాలను అందించారు.	

పైలట్ ప్రాజెక్టుతోనే సరిపెట్టేస్తున్న సర్కారు

- నేటితో ప్రాజెక్టు గడువు పూర్తి
- ఆగస్టు 1 నుంచి ప్రభుత్వ భూముల సర్వే
- ప్రైవేటు భూముల్లో సర్వే ఇక లేనట్లేనా?
- కూటమి సర్కారులో అందని భూ హక్కు పత్రాలు
- జిల్లాలో 1051 గ్రామాల్లో రీ సర్వేకు గత సర్కారు శ్రీకారం
- గత సర్కారులో 34 వేల మంది రైతులకు భూహక్కు పత్రాల జారీ

తిరుపతి అర్బన్ : భూముల రీసర్వేపై కూటమి సర్కారు ఆసక్తి సన్నగిల్లుతోంది. దీంతోనే తరచూ బ్రేకులు పడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా నత్తనడకన సర్వే చేపడుతున్నారు. ఆరు నెలల గడువులో కేవలం 20 వేల ఎకరాలు మాత్రమే సర్వే చేపట్టారు. గత వైఎస్సార్‌సీపీ సర్కారులో రెండేళ్లలో 2,65,457 ఎకరాల్లో సర్వే పూర్తి చేశారు. సర్వే పూర్తి చేసిన 34 వేల మంది రైతులకు గత సర్కారులో భూహక్కు పత్రాలను జారీ చేశారు. అయితే కూటమి సర్కారులో భూ హక్కు పత్రాలను ఇప్పటి వరకు ఇవ్వలేదు. గత సర్కారులో కొందరికి చెందిన భూములు సర్వే పూర్తి చేసినా భూహక్కు పత్రాలు ఇచ్చే సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో నిలుపుదల చేశారు. వారికి కూడా కూటమి సర్కారు భూహక్కు పత్రాలను (సర్వే పూర్తి అయిన తర్వాత రైతులకు ఇచ్చే పత్రాలు) పంపిణీ చేయకపోవడంతో విమర్శలు నెలకొన్నాయి.

నత్తనడకన సాగుతూ..

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 2024 ఫిబ్రవరి 21న సర్వేను నిలుపుదల చేశారు. ఆ తర్వాత రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చింది. తిరిగి 2025 జనవరి 20 వరకు అంటే 11 నెలలు సర్వే పనులు నిలుపుదల చేశారు. అనంతరం ఈ ఏడాది జనవరి 21న రీసర్వే పనులు ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఒక మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని పైలట్ ప్రాజెక్టులో భాగంగా నాలుగు నెలల గడువు సమయంలో భూ సర్వే పూర్తి చేయాలని గడువు ఇచ్చారు. తిరుపతి నగరం మినహా మిగిలిన 33 మండలాల్లో 33 గ్రామాల్లోని 20 వేల ఎకరాలను సర్వే చేయడానికి ఎంపిక చేశారు. నాలుగు నెలల్లో పూర్తి చేయాల్సి ఉండగా ఆరు నెలలు సమయం తీసుకున్నారు. 33 పైలట్ గ్రామాల సర్వే ఈనెల 21తో ముగియనుంది.

ప్రైవేటు భూముల సర్వే ఇక లేనట్లేనా..?

ఆగస్టు 1 నుంచి ప్రభుత్వ భూముల్లో మాత్రమే రీసర్వే పనులు ప్రారంభించనున్నారు. దీంతో ఇకపై ప్రైవేటు భూముల రీసర్వేకు బ్రేక్ పడిందని చర్చించుకుంటున్నారు. ప్రైవేటు, ప్రభుత్వ భూములకు సంబంధించి 15,40,351 ఎకరాల్లో భూసర్వే చేయాల్సి ఉండగా గత సర్కారు రెండేళ్లలో 2,65,457 ఎకరాలు సర్వే పూర్తి చేసింది. నాల్గు దశల్లో సర్వే పూర్తి చేయాలని నిర్ణయించారు. ప్రైవేటు, ప్రభుత్వానికి చెందిన అన్ని భూములనూ గ్రామాల వారీగా సర్వే నిర్వహించారు. అయితే కూటమి సర్కారు సర్వేకు సరైన ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో జాప్యం నెలకొందని చర్చించుకుంటున్నారు.

ప్రభుత్వ భూముల్లో సర్వే



వచ్చే ఆగస్టులో ప్రభుత్వ భూములు మాత్రమే సర్వే చేపడుతాం. ఈ ఏడాది జనవరి 20న పైలట్ ప్రాజెక్టులో భాగంగా తిరుపతి నగరం మినహా ఒక్కో మండలంలో ఒక్క గ్రామం చొప్పున 33 మండలాల్లో 33 గ్రామాల్లోని 20 వేల ఎకరాలు భూముల రీ సర్వే మొదలు పెట్టారు. ఈనెల 21కు పూర్తి అవుతుంది.ఆ తర్వాత గతంలో సర్వే చేసిన ప్రైవేటు భూములు మినహాయించి మిగిలిన ప్రభుత్వ భూములను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే చేయాల్సి ఉంటుంది. అనంతరం భూహక్కు పత్రాలను అందిస్తాం.

– అరుణ్‌కుమార్, సర్వే విభాగం జిల్లా అధికారి

చంద్రగిరి కోటలో అసెంబ్లీ స్పీకర్



రాయలవారికోట ఎదుట అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

చంద్రగిరి: మండలకేంద్రంలోని రాయలవారి కోటను రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు బుధవారం సందర్శించారు. సెప్టెంబర్ 14, 15 తేదీల్లో తిరుపతి నగరంలో జరగనున్న జాతీయస్థాయి మహిళా సాధికారత కమిటీ సమావేశాలకు దేశంలోని అన్ని రాష్ట్రాల అసెంబ్లీ మహిళా సాధికారత కమిటీ సభ్యులు, పార్లమెంటు మహిళా సాధికారత కమిటీ సభ్యులు, పార్లమెంట్ స్పీకర్, రాష్ట్రగవర్నర్, ముఖ్యమంత్రి ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో చారిత్రాత్మక కట్టడమైన చంద్రగిరి కోటను మహిళా సాధికారత కమిటీ సభ్యులు సందర్శించనున్నారు. ఈ సమావేశాల ఏర్పాట్లపై తిరుపతికి విచ్చేసిన రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డితో కలిసి చంద్రగిరి కోటను సందర్శించారు. చంద్రగిరి కోట ప్రాశస్త్యాన్ని, విశేషాలను తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి అసెంబ్లీ స్పీకర్‌కు వివరించారు. చంద్రగిరి కోటను సందర్శించే మహిళా సాధికారత కమిటీ సభ్యులకు చంద్రగిరి కోటలో మ్యూజికల్ లైట్స్ షోను ఏర్పాటు చేస్తామని, అలాగే ఆ రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు వారికి పసందైన విందును ఏర్పాటు చేస్తామని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి తెలిపారు. దేశం నలుమూలల నుంచి వచ్చే అతిథుల కోసం ఏర్పాటు చేసే ఆంధ్ర ఆతిథ్యం అదిరిపోవాలని స్పీకర్ సూచించారు. చంద్రగిరి కోట ఆవరణలో అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడిని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ఘనంగా సత్కరించారు.

క్లుప్తంగా

ఖాళీ బిందెలతో ఆందోళన



ఆందోళన చేస్తున్న గిరిజన మహిళలు

రాపూరు: మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గిరిజన మహిళలు బుధవారం ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా మహిళలు మాట్లాడుతూ రాపూరు సమీపంలోని ఆంజనేయపురం గిరిజనవాడలో రెండు వారాలు కిందట ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని, ఈ విషయమై పలుసార్లు అధికారులకు విన్నవించినా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. విద్యుత్ లేకపోవడంతో మంచినీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సుదూరంలోని బోరు వద్దకు వెళ్లి తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. దీంతో ఖాళీ బిందెలతో సబ్‌స్టేషన్‌కు చేరుకుని, ధర్నా చేపట్టామన్నారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని ట్రాన్స్‌కో ఏఈ కార్తీక్ హామీ ఇవ్వడంతో అక్కడి నుంచి వెనుతిరిగారు.

గొడ్డేరు వాగులో మృతదేహం

వెంకటగిరి రూరల్: మండలంలోని చింతగుంట సమీపంలో ఉన్న గొడ్డేరువాగులో వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమైంది. ఎస్‌ఐ ఏడుకొండలు కథనం మేరకు.. చింతగుంట వాగులో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పరిశీలించగా పట్టణంలోని మూలసాలివీధికి చెందిన దొంతు మునెయ్య (50)గా గుర్తించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మునెయ్య వాగులోకి దిగి ప్రమాదవశాత్తు మునిగిపోయి మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సంస్కృత వర్సిటీలో అనిర్బన్

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీని కేంద్ర ప్రభుత్వ హోం మంత్రిత్వశాఖ బెంగళూరు ప్రాంతీయ కార్యాలయ అధికార భాషా విభాగం డిప్యూటీ డైరెక్టర్ అనిర్బన్ కుమార్ బిశ్వాస్ బుధవారం సందర్శించారు. వర్సిటీలోని రాజభాష విభాగాన్ని పరిశీలించిన అనంతరం వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తితో పాటు అధికారులతో బృందం సమావేశమైంది. వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 351 ప్రకారం, పాలనా పని సమర్థవంతంగా జరగాలని, కార్యాలయ ఉత్తర ప్రత్యుత్తరాలు హిందీ, ద్విభాషల్లో ఉండాలని, కంఠస్థం 2.0 ఆధారంగా అనువాద సాఫ్ట్‌వేర్ వినియోగించాలని సూచించారు. అనంతరం వర్సిటీ ఆర్థిక, స్థాపన విభాగంలోని పరిపాలనా పత్రాలను బృందం తనిఖీ చేసింది. అనంతరం పర్యటనకు విచ్చేసి బృందాన్ని వర్సిటీ అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు, డీన్‌లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై అర్ధరాత్రి యువకుడి కిడ్నాప్!

- ఆటోలో తరలించి విచక్షణా రహితంగా దాడి
- చికిత్స కోసం రుయాకు తరలించిన స్నేహితులు
- తిరుపతి రూరల్ పోలీసులపై జిల్లా ఎస్పీ ఆగ్రహం
- బాధితుని వాంగ్మూలంతో కేసు నమోదు చేసిన సీఐ



దాడిలో గాయపడిన శశియాదవ్

సాక్షి, టాస్క్‌ఫోర్స్: పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై వందలాది వాహనాలు సంచరిస్తున్నా అర్ధరాత్రి ఓ యువకుడుని కిడ్నాప్ చేసి ఆటోలో తరలించారు. ఆపై విచక్షణా రహితంగా అతనిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. తిరుపతి రూరల్ మండలం లింగేశ్వరనగర్ పంచాయతీకి చెందిన శశి యాదవ్, అతని స్నేహితుడు తాహిర్‌బాబాతో కలసి జాతీయ రహదారి వద్ద ఉన్న నిధి కేఫ్‌కు మంగళవారం అర్ధరాత్రి సమయంలో వెళ్లాడు. అక్కడ వాటర్ బాటిల్ తీసుకుని తాగుతుండగా కొందరు యువకులు అక్కడకు చేరుకుని శశియాదవ్‌ను బలవంతంగా కిడ్నాప్ చేసి ఆటోలో చంద్రగిరి మండలం తొండవాడ వద్ద ఉన్న ఓ ప్రైవేటు వెంచర్‌కు తీసుకెళ్లారు. శశియాదవ్‌ను కిడ్నాప్ చేసి తీసుకువెళుతున్న ఆటోను కొంత దూరం నుంచి వెంబడించిన తాహిర్‌బాబా విషయాన్ని తమ స్నేహితులకు చేరవేశాడు. ఆ విషయం తెలుసుకున్న శశియాదవ్ స్నేహితులంతా తొండవాడ వద్దకు చేరుకున్నారు. అప్పటికే కిడ్నాపర్లు శశి యాదవ్‌ను చచ్చేలా కొట్టడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ఇంతలో శశియాదవ్ స్నేహితులు సంఘటన స్థలానికి చేరుకోవడాన్ని గమనించిన కిడ్నాపర్లు అక్కడ నుంచి పరారయ్యారు. శశియాదవ్‌ను స్నేహితులు చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. రాత్రంతా అంత గొడవ జరిగినా తెలుసుకోలేని తిరుపతి రూరల్ పోలీసులు బుధవారం ఉదయం కిడ్నాప్ వ్యవహారాన్ని తెలుసుకుని రుయా ఆస్పత్రికి వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న శశియాదవ్ ద్వారా వివరాలు తెలుసుకుని స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు. కిడ్నాప్‌నకు ప్రధాన కారణం ఇటీవల జాతరలో జరిగిన పాత కక్షలేనని నిర్ధారించుకున్న పోలీసులు కిడ్నాపర్ల కోసం వేట ప్రారంభించారు. శశి యాదవ్‌ను కిడ్నాప్ చేసిన వారిలో సంతు, తేజ, అజయ్, పునీత్‌తో ఆటు మరో ఆరుగురు గుర్తు తెలియని వ్యక్తులు ఉన్నట్టుగా గాయపడిన శశియాదవ్ పోలీసులకు వివరించడంతో వారి కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు. బాధితుని ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు కేసు నమోదు చేశారు.

తిరుపతి రూరల్ పోలీసులపై ఎస్పీ ఆగ్రహం

జాతీయ రహదారిలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్నప్పటికీ బలవంతంగా ఒక యువకుడిని కిడ్నాప్ చేసి ఆటోలో తరలించి చచ్చేలా కొడుతున్నప్పటికీ గుర్తించలేకపోవడం, కనీస సమాచారం కూడా పోలీసులకు రాకపోవడంపై జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తిరుపతి రూరల్ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. అసలు రాత్రి వేళల్లో జాతీయ రహదారిపై తిరగాల్సిన పెట్రోలింగ్ సిబ్బంది ఏమయ్యారు? జాతీయ రహదారిపై రాత్రి వేళ ఏం జరిగినా ఇలాగే వదిలేస్తారా? కనీసం ఆ నిధి కేఫ్ వారు కూడా పోలీసులకు సమాచారం ఎందుకు ఇవ్వలేదు? అని ప్రశ్నిస్తూ అసంతృప్తి వ్యక్తం చేసినట్టుగా తెలుస్తోంది. ఎస్పీ ఆగ్రహంతో అప్రమత్తమైన తిరుపతి రూరల్ పోలీసులు హుటాహుటిన ఆ కేఫ్ వద్దకు చేరుకుని అక్కడ ఏం జరిగిందన్న దృశ్యాలను అక్కడి సీసీటీవీ ఫుటేజీ ద్వారా తీసుకుని బాధితుని వద్దకు వెళ్లి వాంగ్మూలం తీసుకున్నట్టు సమాచారం.

మత్స్యకారుల నుంచి అధిక వసూళ్లు

వాకాడు: మత్స్యకారుల బోట్ల రిజిస్ట్రేషన్ మూడేళ్లకొకసారి నామమాత్రపు రుసుంతో ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేయాలి. కానీ ఈ సారి మత్స్యశాఖ అధికారులు దానికి భిన్నంగా బోట్లు రిజిస్ట్రేషన్ పేరుతో అధిక వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ సందర్భంగా బుధవారం వాకాడు మండలంలోని మత్స్యకార గ్రామాల్లో సాక్షి పరిశీలించగా బోట్లు రిజిస్ట్రేషన్ పేరుతో తమ నుంచి అధిక మొత్తంలో అధికారులు వసూలు చేస్తున్నారని మత్స్యకారులు వాపోయారు. సాధారణంగా సముద్రంపై వేట చేసే మత్స్యకారుల బోట్లు ప్రతి ఏడాది కొత్త, పాత బోట్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, అందుకు గతంలో నామమాత్రపు రుసుం కింద ఏడాదికి రూ.55 చెల్లిస్తే బోటు రిజిస్ట్రేషన్ అయ్యేదన్నారు. కానీ ఈ సారి ఎప్పుడు లేని విధంగా ఒక్కో బోటుకు రూ. వెయ్యి చెల్లించాలంటూ అధికారులు డిమాండ్ చేస్తున్నట్లు మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. వాకాడు, చిల్లకూరు, కోట, తడ, సూళ్లూరుపేట మండలాల్లో దాదాపు 1050 బోట్లు ఉన్నాయి. దాదాపు రూ.10 లక్షలకు పైగా అధికారులు అదనపు వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై గతంలో పనిచేసిన జిల్లా మత్స్యశాఖ జేడీ నాగారాజును వివరణ కోరగా బోట్లు రిజిస్ట్రేషన్ పేరుతో అధిక మొత్తం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఒక్కో బోటుకు ఏడాదికి రూ. 55 మాత్రమే చెల్లించాలన్నారు. సకాలంలో రిజిస్ట్రేషన్ చేసుకోని బోట్లు మాత్రం అపరాధ రుసుం కింద రూ. 10 అదనంగా చెల్లించాలన్నారు. అలాగే మూడు సంవత్సరాలకు కలిపి ఒకే సారి బోట్లు రిజిస్ట్రేషన్ చేసుకునే మత్స్యకారులు కేవలం రూ.165 మాత్రమే చెల్లించాలన్నారు. ఎవరికీ రూపాయ కూడా అదనంగా ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు.

28 నుంచి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట మైదానంలో ఈ నెల 28 నుంచి రెండు రోజులపాటు బాలబాలికలకు అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఆ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రాబర్ట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 9నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా నుంచి పాల్గొనేందుకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 28వ తేదీన అండర్–14, 16బాలబాలికలకు, 29వ తేదీన అండర్–18, 20 బాలబాలికలకు వేర్వేరుగా ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు తప్పనిసరిగా జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 86868 67079ను సంప్రదించాలని కోరారు.

పుత్తూరు సీఐ వీఆర్‌కు!

పుత్తూరు : స్థానిక సీఐ కే.బీ.సురేంద్రనాయుడు వీర్ (వేకన్సీ రిజర్వు)కు బదిలీ అయ్యారు. సోమవారం ఎస్పీ కార్యాలయం నుంచి వీర్ ఆదేశాలను అందుకున్న సీఐ అదేరోజు ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ వీర్ బదిలీ కేవలం రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే జరిగినట్లు పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. అయితే సీఐపై ఇటీవల పలు ఆరోపణలు వచ్చినట్లు అందుకు తగిన ఫలితమేనని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

ఎర్రచందనం స్వాధీనం



నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్‌ఐ మల్లికార్జున

వరదయ్యపాళెం: తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. రహస్య సమాచారం మేరకు బుధవారం తెల్లవారుజామున వరదయ్యపాళెం బస్టాండ్ వైపుగా వెళుతున్న మినీ వ్యాన్‌ను పోలీసులు ఆపి తనిఖీ చేశారు. అందులో 200 కిలోల బరువు ఉన్న 11 ఎర్రచందనం దుంగలు ఉండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ వాహనానికి ఎస్కార్ట్‌గా వస్తున్న మరో స్కార్పియో వాహనాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకుని అందులో ఉన్న నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. అక్రమ రవాణాకు పాల్పడింది వారేనని నిర్ధారణ కావడంతో లంక వినోద్, కృష్ణ, పెంచలయ్య, అనిల్‌పై కేసు నమోదు చేశారు. నిందితులను బుధవారం సాయంత్రం వరదయ్యపాళెం పోలీస్ స్టేషన్‌లో అరెస్టు చూపి, సత్యవేడు కోర్టుకు హాజరు పరచడంతో న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించినట్లు ఆయన పేర్కొన్నారు. తనిఖీల్లో సిబ్బంది సాయిబాబా, సుబ్బు, హరి, గణేష్, బాలు, ఉదయ్ పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన సమగ్రశిక్ష ఏపీసీ గౌరీ శంకర్



కేజీబీవీలో జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ

తడ: జిల్లా సమగ్ర సర్వశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జీ గౌరీ శంకర్‌రావు ఇతర అధికారులతో కలిసి బుధవారం తడ కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల సిబ్బందితో సమావేశం నిర్వహించి, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, పదో తరగతిలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా చూడాలని కోరారు. పిల్లలకు చక్కటి భోజనం, పరిశుభ్రమైన వాతావరణంలో పెట్టాలని, శుభ్రమైన తాగునీటిని అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ భువనేశ్వరి, జీసీడీఓ పుష్పలత, ఎంఈఓ మల్లి కార్జున రావు, అభయ హస్తం పల్లవి పాల్గొన్నారు.

అన్యాయంగా జైల్లో పెట్టించారు!



తనను జైల్లో పెట్టించారని చెబుతున్న లక్ష్మమ్మ

చిట్టమూరు: కూటమి నేతలు తనని అన్యాయంగా రెండు నెలలు సెంట్రల్ జైల్లో పెట్టించారని చిట్టమూరు మండలంలోని గునపాటిపాళేనికి చెందిన చిప్పల లక్ష్మమ్మ వాపోయింది. గ్రామంలో బుధవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ –మోసం గ్యారంటీ కార్యక్రమానికి హాజరైన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ వద్ద లక్ష్మమ్మ తన గోడు వెళ్లబోసుకుంది. గ్రామంలో తండ్రి కొడుకులు, గొడవలు చేసుకుంటే వారికి సర్ది చెప్పేందుకు వెళ్లిన తనపై కూటమి నేతలు నాన్ బెయిలబుల్ కేసు పెట్టించి, ఏ తప్పు చేయకపోయినా వైఎస్సార్ సీపీ సానుభూతి పరులమైన తమ ముగ్గురిని జైల్లో పెట్టించారని కన్నీటీ పర్యంతమైంది. వైఎస్సార్ సీపీ మండల నాయకులు, గ్రామంలోని నాయకుల సహాయ సహకారాలతో తాము బెయిల్‌పై బయటకు వచ్చామని వారికి కృతజ్ఞతలు తెలియజేసింది.

నా బిడ్డకు ప్రాణభిక్ష పెట్టండి



మాట్లాడుతున్న బాలుడి తల్లి చెంగమ్మ

తిరుపతి కల్చరల్: బ్లడ్ క్యాన్సర్‌తో ప్రాణాపాయ స్థితిలో ఉన్న తన బిడ్డ వైద్యం కోసం దాతలు ఆర్థిక సాయం చేసి, తన బిడ్డ ప్రాణాలను కాపాడాలని చిన్నారి తల్లిదండ్రులు చెంగమ్మ, దేశయ్య మీడియా ముందు వేడుకున్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నారాయణవనం మండలం, నాగిలేరు గ్రామం యానాదిసెంటర్‌లో కాపురముండే తాము నిత్యం కూలీ పనులు చేసుకుంటూ బతుకుతున్నామన్నారు. అయితే తన కుమారుడు మురళి(8)కు తీవ్ర జ్వరంతో అనారోగ్యం బారిన పడడంతో రుయా ఆస్పత్రిలో చికిత్స చేయించామని తెలిపారు. అయితే తన బిడ్డకు బ్లడ్ క్యాన్సర్ అని గుర్తించిన వైద్యులు స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్సకు రెఫర్ చేశారని తెలిపారు. స్విమ్స్‌లో తమ బిడ్డను పరీక్షించిన వైద్యులు బాబుకు టెస్ట్ చేయించాలని, అందుకు రూ.40వేలు ఖర్చు అవుతుందని, అంతేకాక బ్లడ్ క్యాన్సర్ పూర్తిగా నయం అయ్యేందుకు సుమారు రూ.20 లక్షలు ఖర్చు పెట్టాలని వైద్యులు సూచించారని వాపోయారు. రోజువారీ కూలీ చేస్తే కాని బతుకు సాగని తమకు అంత డబ్బులు పెట్టి బిడ్డకు వైద్య చేయించే స్తోమత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాతలు స్పందించి తగిన ఆర్థిక సాయం అందించి, తమ బిడ్డకు ప్రాణభిక్ష పెట్టాలని కన్నీటి పర్యవంతమయ్యారు. సాయం అందించే దాతలు తమ ఫోన్ నంబర్ 7780253548ను సంప్రదించి, ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దారి కల్పించే వారేరీ?

- ఎంపీపీ ఆదేశాలతో గ్రామానికి వెళ్లిన అధికారులు
- రాజకీయ ఒత్తిడి తట్టుకోలేక వెనుదిరిగిన వైనం



దారి సమస్య పరిష్కారానికి వెళ్లిన అధికారులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: పట్టా భూముల్లో దారి కావాలంటే కుదరదని చెప్పినందుకు ఆ ఇంటికి రాకపోకలు లేకుండా చేశారు.. కూటమి నేతలందరూ ఏకమై ఆ కుటుంబాన్ని వారం రోజులుగా బయటకు రానీయకుండా నిర్బంధించారు. అత్యవసరానికి సైతం వెళ్లడానికి వీలు లేకుండా గ్రామంలోని సిమెంటు రోడ్డుకు అడ్డుగా ఇనుప కంచెను నిర్మించారు. ఆ ఇంటికి దారి కల్పించే బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ రాజకీయ ఒత్తిళ్లతో ఆ పనిచేయలేకున్నారు. గ్రామంలోకి వెళ్లి కళ్లారా అక్కడ జరుగుతున్న దుశ్చర్యలను చూసినప్పటికీ రాజకీయ ఒత్తిడి తట్టుకోలేక దారి సమస్యను అలాగే వదిలేసి వెనుదిరిగారు. తిరుపతి జిల్లా ఎర్రావారిపాళెం మండలం కమలయ్యగారిపల్లి పంచాయతీ బడగనపల్లిలో నివాసముంటున్న వెంకటరమణ ఇంటికి రాకపోకలు లేకుండా చేశారు. వారం రోజులకు పైగా ఆ ఇంట్లోని సభ్యులు ఎవరు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. మండలస్థాయి అధికారులకు విన్నవించినా ఏ ఒక్కరు పట్టించుకోలేదు. దీంతో బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ రెడ్డెమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు కరుణాకర్‌రెడ్డి అధికారులను నిలదీశారు. బడగనపల్లిలో ఓ ఇంటికి దారి లేకుండా ఇనుప కంచె ఏర్పాటు చేస్తే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాజకీయ కక్షలతో ఓ కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేయడం, అందుకు అధికారులు స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ కుటుంబానికి న్యాయం చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో సర్వసభ్య సమావేశం ముగిసిన తరువాత ఎంపీడీఓ మదన మోహన్‌రెడ్డి, తహసీల్దార్ పరమేశ్వరస్వామి, ఎస్‌ఐ బాలకృష్ణలు ఆ గ్రామానికి చేరుకుని దారికి అడ్డుగా ఏర్పాటు చేసిన ఇనుప కంచెను పరిశీలించారు. అసలు ఆ కంచె ఏర్పాటు చేయడానికి గల కారణాలను తెలుసుకుని పట్టా భూముల్లో శాశ్వత రోడ్డు కావాలంటే పట్టాదారు అనుమతి కావాల్సిందేనని, అలా ఇవ్వనందుకు ప్రభుత్వ నిధులతో నిర్మించిన సిమెంటు రోడ్డుపై కంచె ఏర్పాటు చేయడం చట్ట వ్యతిరేకమని సూచించారు. అయినా సరే కంచెను తీసేదిలేదని కూటమి పార్టీలకు చెందిన వారు భీష్మించుకున్నారు. ఇంతలో స్థానిక ముఖ్యప్రజాప్రతినిధి నుంచి ఫోన్లు రావడంతో అధికారులు ఏమీ చేయలేక మిన్నకుండిపోయారు. అనంతరం కొంతసేపటికి ఇనుపకంచెను తొలగించకుండానే వెనుదిరిగారు. రాజకీయ ఒత్తిళ్లు తట్టుకోలేక వెనుదిరగాల్సి వస్తోందని బాధిత కుటుంబసభ్యులకు చెప్పి వెళ్లడం గమనార్హం.